★ మేఘాలలో మెఱుపు ★

శ్రీ డి. వి. ఆర్. ప్రభాకరశాస్త్రి, బి.ఏ., బి.ఇ.డి.

శారదకు నిద్రపట్టలేదు. కొంచెం తల ఎత్తి అటూ ఇటూ చూసింది. బుడ్డి దీపం సన్నగా వెలుగుతోంది గడపమీద. ప్రక్కనే నాలుగు గజాల దూరంలో తల్లి పడుకొని ఉంది నిశ్శబ్దముగా. తల్లికి ఇంకా నిద్ర పట్టిందో లేదో! ఔను! ఆమెకు మాత్రం నిద్ర ఎట్లా పట్టుంది? తనే ఇంత బాధ పడుతుంటే తనను కన్న తల్లి కళ్ళారా తను పడే ఇడుములు చూసి నిద్ర పోగలదా అనుకుంది శారద. తన తండ్రే బ్రతికి ఉన్నట్లయితే, ఎంత బాధ పడేవాడో తన్ను చూసి అనివిలపించింది శారద మనస్సులో. కాని అటువంటివేమీ లేకుండానే, ఆయన తన పెండ్లి అయిన ఏడాదికే చనిపోయినందుకు మరు క్షణమే ఒక విధంగా సంతోషించిందామె.

బయట ఏదో చప్పుడైంది. శారదకు భయం వేసింది. తన భర్త ఏమైన దొంగతనానికి వచ్చాడేమోనని! ఔను. లంజలకోసం గోడలురికేవాడు, దొంగతనానికిమాత్రం ఎందుకు బయలుదేరకూడదు? అందులోను తనదగ్గర రెండు జతలగాజులు, గొలుసు, మంగళసూత్రాలు ఉన్న సంగతి తన మొగుడికి తెలుసు. భార్యనైతే ఏలుకోక పోవచ్చుకాని, ఆమె నగలమీదే ఉంది వాడి దృష్టి. వాటి కోసం వాడు ఎప్పుడు వచ్చినా రావచ్చు, ఎట్లావచ్చినా రావచ్చు! శారద అతనటువంటి వాడేనని తన రెండేళ్ళ కాపురంలోను గ్రహించింది.

అది ఒకటేగాదు. రావు యొక్క పూర్వచరిత్ర అంతా కూడా ఆమె గ్రహించింది, కాపురానికి వెళ్ళేక. అతను ఇంటరు చదివేరోజులలోంచికూడా, చంచల మనస్కుడవటంచేత ఇంటరు ప్యాసవడానికి ఆరు సంవత్సరాలు పట్టిందట. సహజమైన కామవికాస వేగానికి రావు తట్టుకోలేకపోయినాడని కొద్దిరోజులలోనే తెలుసుకుంది. కొడుకు యొక్క కామ వాంఛలకు శాస్త్ర బద్ధమైన మార్గమును చూపుదామనే ఉద్దేశంతోటే కాబోలు నాడు రావు తండ్రి కొడుకుకు పెండ్లి చేశాడు. పెళ్ళి చూపులనాడే సంగతులన్ని తెలిసిఉంటే శారద అతన్ని పెళ్ళిచేసికునేదికానేకాదు.

2

శారద తండ్రి బడిపంతులుగా కష్టపడి సంపాదించిన నాల్గువేల రూకలు గల గల పళ్ళెంలో పోసి వరకట్నంగా ఇచ్చి, తన ముద్దుల కూతుర్నిచ్చి, సుఖపడుతుందనే ఉద్దేశంతో రావు కిచ్చి పెండ్లి చేశాడు. ఆ పళ్లెం, ఆనందంతో, కళ్ళు పెద్దవి చేసికుని చూస్తూ, దేవేంద్రుడిలాగ తీసుకున్నాడు రావు తండ్రి. కాని పెండ్లయి, భార్య కాపురానికి వచ్చాకకూడ, రావు తన వెనుకటి గుణాలు మానలేదు. శారద ముసి ముసి నవ్వులు నవ్వినా, ఒయ్యారంగా సయ్యాటలాడినా, చమత్కరించినా, మరెన్ని విధాల ప్రయత్నించినా శారద విఫల అయిపోయింది, రావు మనస్సు నరికట్టడంలో. తనను తాను అద్దంలో చూసుకునేది శారద, తానేమైనా కురూపి యేమోనని. కాని మరుక్షణంలో, తనకు ఫిఫ్త్ ఫారం చదివే రోజులలో వస్తుండే ప్రేమలేఖలు జ్ఞాపకం వచ్చేవి. అన్నీ చదువుకొని, తన అందానికి గర్విస్తూ, ఆలేఖలను తునియలుగా చింపి పారవేసేది శారద ఆనాడు. ఆప్రేమికులను నిరాశపరచినందుకే గాబోలు నేడు భర్త తనవైపు చూడకుండా పోతున్నాడు, అని శారద మధ్య మధ్య బాధ పడుతూండేది!

శారద కాపురానికి వెళ్ళేక ఏ నెల్లాళ్ళు భర్తచే సుఖపడ్డదో అంతే. పైపెచ్చు అత్తారింటి చాకిరీ, కసుర్లు మరీ పీల్చి పిప్పిచేశాయి. ఎంత కోడంద్రికమైన, ఎంత చాకిరీ అయినా భర్త అనువుగా ఉండి ఆదరిస్తేకదా ఆమె భరించేది! భర్త విముఖుడై సందులు గొందులు పట్టి చెడిపోతుంటే, ఎంత వారించినా వినక తనను ఉపేక్ష చేస్తుంటే, ఆమె మాత్రం ఎట్లా సైరించగలదు? తన భర్తవంటి దుశ్శీలురకు బుద్ధి చెప్పలేని తనలాంటి స్త్రీలను తలుచుకుంటే మరీ తలవంపుగా భావించేది శారద. తన అశక్తతకు మధ్య మధ్య తనను తానే నిందించుకునేది!

దీనికి సాయం, రావు మంచో చెడో ఇంటరు ప్యాసయినాడు మార్చిలో. ఫలితాలు వచ్చిందే తడవుగా "నేను చదువుకు సీట్లకోసం పోవాలి— ఒక ఐదు వందలియ్యి నాన్నా!" అని అడిగేడు తండ్రిని. "ఇక్కడనుంచి దరఖాస్తులు పడవెయ్యిరా, చాలులే!" అన్నాడాయన. "అట్లా కాదు నాన్నా! వాళ్ళదగ్గరకుపోయి 'ట్రై' చేస్తే, ఆశ్రయిస్తే కాని సీటు ఇవ్వరు" ఏమనుకున్నాడో ఏమో తండ్రి మారు మాటాడక చేరడానికి కావలసిన డబ్బిచ్చి పంపించివేశాడు కొడుకును.

మేఘాలలో మెఱుపు

3

రావు ఊరు విడిచి వెళ్ళినదే తడవుగా రావు తండ్రి యొక్క తలలో తెలివితేటలు వెఱ్ఱి తలలు వేయనారంభించేయి. నెరసిన అతని తలవెంట్రుకల కుదుళ్ళతో చీడ పురుగులు చిమ చిమ లాడటం ప్రారంభించేయి. "ఆమధ్య అమ్మాయిగారింటికి వెడతానన్నావు వెళ్ళవే! అమ్మాయికి కాస్త నలతగాకూడా ఉందట," అని ముసలాయన భార్యను కూతురుగారింటికి పంపివేశేడు. ముసలావిడ కూతుర్ని చూద్దామనే కుతూహలంతో హడావిడిగా వెళ్ళిపోయింది కూతురిగారింటికి. ముసలాయన పుఱ్ఱెలో పుచ్చు బుద్ధులు పుట్టుకవచ్చేయి.

శారద తన మామగారంతటి దుర్మార్గానికి ఒడిగడ్తాడని కలలోకూడా అనుకోలేదు. పశుప్రాయుడని ఎన్నడూ ఊహించలేదు. మనువు చెప్పినట్లు అది ఏకాంతంయొక్క దుశ్శక్తియో. లేక ముసలాయనలోని అసంతృప్తి కామవాంఛలో విజృంభణయో కాని శారదయందు కామవాంఛలను వెలిబుచ్చేడు! శారద నివ్వెరబోయింది! "తండ్రి వంటివారు--- మీకీబుద్ధి భావ్యంగాదు" అంది. "తండ్రి కూతుర్ని ముద్దుడుకోడూ?" అన్నాడు, పితృప్రేమ, భర్తృప్రేమల తారతమ్యం గుర్తించలేని ఆ పశువు. శారద ఈసంగతి తెలియపరుస్తూ భర్తకు తంతి ఇద్దామనుకుంది. కాని తనమాట నమ్మి, సెలవిచ్చి, ఆదరించే భర్త కాదుకదాతన భర్త. అని విలపించింది ఆ అసహాయ స్త్రీ. పైగా తనమాట నమ్మేదెవరు? ముసలాయన వాలకంచూసి, 'గోవు' అనుకునేవాళ్ళే కాని, లోనున్న శునకలక్షణాలసంగతి నమ్మేవారెవరు? విన్నవాళ్ళు పైపెచ్చు తననే దూషిస్తారని మథన పడింది శారద. ఎటూ పాలుపోలేదు. ఆ మృగం దగ్గరఉంటే, ఏ క్షణంలో అది తనపైబడి బాధిస్తుందోనని భయపడింది ఆమె—— ముసలాయన తన కోసం మల్లెపూలు తీసికొని రావడానికిని వెళ్ళేడు బజారుకి! వెంటనే బ్రతుకు జీవుడా అని తక్షణమే ఆ ఇల్లు విడిచిపెట్టివేసి పుట్టింటికి కట్టుబట్టలతో వచ్చేసింది శారద.

4

తల్లి కంగారు పడింది కూతురియొక్క ఈ అనుకోని రాకనుచూసి. బిడ్డ పెట్టుకన్నీరుకుంటూ భర్త పరాకుని, మామగారి పశుత్వాన్నిగూర్చి వివరిస్తుంటే తల్లి పడ్డ బాధ ఇంతా అంతా కాదు. శారద తండ్రి చనిపోవటంచేత వచ్చిన ఇన్సూరెన్సు డబ్బు పెట్టుకొని, ఇల్లు ఒక ప్రక్క నద్దెల కిచ్చుకుని, తంటాలుపడుతూ ఆవిడ కాలం వెళ్ళపుచ్చుతోంది, ఇక వేరే దిక్కులేక. కూతురుపడే బాధలు ఆమె ఎరుగున్నా, ఈవేళకాకపోతే రేపైనా అల్లుడికి కుదురు రాకపోతుందా అనే ఆశతో, కూతుర్ని అత్తవారింటనే ఉంచిందిన్నాళ్ళూను. కాని ముసలాయన సంగతి విన్నాక ఆమె హతాశురాలైంది. రావులోని నైచ్యానికి బీజం అసలు అభిజాత్యంలోనే ఉందని ఆమె గ్రహించింది. ఇక కూతుర్ని ఆమె పంపదలుచుకోలేదు: శారద వెళ్ళదలుచుకోలేదు. అత్తవారి అంతు అసలేలేదు!

కాని తల్లితోపాటు మార్చుకొని తిని కూచోడమేనా, లేక మరోమార్గమేమైనా ఉందా అనే ఆలోచన శారదను బాధిస్తోంది అప్పటినుంచి. నిద్రపట్టటంలేదు రకరకాల ఆలోచనలతోటి. శారద మళ్ళీ కళ్ళుమూసింది మెలకువతోనే. తిరిగి కళ్ళు తెరిచింది. గడపమీద బుడ్డి దీపం యొక్క వెలుగుమూలాన్న గదిఅంతా కాస్త కనుచీకటిలో కనపడుతోంది. తటాలున శారదకు ఒక ఆలోచనతట్టింది. వచ్చేమార్చికి మెట్రిక్కు కట్టి.... ఆతర్వాత సెకండు గ్రేడు ట్రయినింగ్ అయి. ఏబడిలోనయినా జేరితే పంతులమ్మగా? వివాహం మూలంగా నాడు ఫిఫ్త్ ఫారం చదువుతూ మానేసింది. కాని నేడు నిశ్చితంగా చదువుకోవచ్చు!.... తర్వాత తనపొట్ట తాను పోషించుకోవచ్చు!! విజ్ఞానం సంపాదించుకోవచ్చు!!!........ పశువులదోవ పశువులదే మానవుడిదోవ మానవుడిదే!....

పసిహృదయాలమధ్య కాలం గడుపుకుంటూ, అమాయకత్వంతో కలకలలాడుతూ కిలకిలలాడే ఆముఖాలను తన బిడ్డలలాగ ప్రేమించి, లాలించి బోధిస్తూ కాలం గడుపుకోవడంకంటే తనకు కావలసినదేముంది అనుకుంది శారద. కారుమేఘాలమధ్య మెఱుపు ఒకటి మెరసింది. బుడ్డి దీపం గడపమీద మరింతకాంతితో వెలుగుతున్నట్లు కనపడింది ఆమెయొక్క విప్పారిన కండ్లకు!!